# మాతృదేవోభవ

– కందుకూరి వెంకట మహాలక్ష్మి

'ఏమండీ! యింకా అలా కూర్చున్నారేమిటీ? మీ పెట్టెప్పుడు సర్దుకుంటారు? రేపే కదా మనని ప్రతాప్ దింపేది! మళ్లీ అబ్బాయి వాళ్లూ యిల్లు ఖాళీ చేసేటప్పుడు అక్కరలేని సామాన్లను కొని బైటపడేస్తే- అయ్యో! యిది తెచ్చుకోవడం మర్చిపోయాను, అది మర్చిపోయానని బాధపడతారు. మీ బట్టలయితే నాకు తెలుసు. మిగిలిన సామాన్ల గురించి నాకేం తెలుసు?' అంటున్న అలివేణి వైపు వెర్రివాడిలా చూస్తున్నాడు అయోధ్యరామయ్య.

అతనికీ తెలుసు- కొడుకు ప్రతాప్, కోడలు సునీత, మనవడు అంగద్‌ని తీసుకుని త్వరలో అమెరికాకి వెళ్లిపోతున్నారు. పెద్దకొడుకు ప్రవీణ్ భార్యాబిడ్డలతో రెండేళ్ల క్రితమే గల్ఫ్‌కి వెళ్లిపోయాడు. అప్పటినుంచీ రిటైరయిన అయోధ్యరామయ్య, భార్య రెండో కొడుకు దగ్గర ఉంటున్నారు.

ప్రయివేటు కంపెనీలో పనిచేసే ప్రతాప్ రాత్రి ఎనిమిది దాటితే గానీ ఇంటికొచ్చేవాడు కాదు. అయోధ్యరామయ్య బయటి నుంచి సరుకులు తేవడం, పిల్లాడిని స్కూలులో దింపడం, తీసుకురావడం లాంటివి చేస్తూ వుంటే, అలివేణి ఇంట్లో వంటా, పనీ చూసుకునేది. కోడలు కూడా ఉద్యోగస్తురాలు కావడంతో భార్యాభర్తలిద్దరికీ తీరికలేని పని వుండేది.

ఎంత పని చేస్తున్నా సాయంకాలం అయ్యేసరికి మనవడితో కాలక్షేపంతో వాళ్లు అలసటని మర్చిపోయి ఎంతో ఉల్లాసంగా వుండేవారు.

అలాంటిది నెల్లాళ్ల క్రితం ప్రతాప్ వాళ్ల గుండెల్లో బండరాయి పడేలాంటి కబురు చెప్పాడు. తాము యు.ఎస్.కి వెళ్తున్నట్లు చెప్పినప్పటి నుంచీ వృద్ధ దంపతులిద్దరూ అన్యమనస్కంగానే వున్నారు. 'మేమెక్కడుండాలిరా- మీరు వెళ్లిపోతే!' అని కొడుకుని అడిగినప్పుడు, 'అదే నాన్నా... కనుక్కుంటున్నాను. మంచి ఓల్డేజ్ హోమ్ కోసం చూస్తున్నాను' అన్నాడంతే.

రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో వుండే ఓ హోమ్ గురించి చెప్పి, తమని అక్కడ చేర్పిస్తున్నట్లు చెప్పగానే అలివేణి మాటెలాగున్నా, అయోధ్యరామయ్యకి మాత్రం గుండెలు గుభేలుమన్నాయి.

'ఇన్నేళ్లూ స్వతంత్రంగా బ్రతికిన తనూ, భార్యా యిప్పుడు ఓల్డేజ్ హోమ్‌లో ఎలా వుండగలరు? ఎంతయినా నా అన్నవాళ్ల మధ్య వున్నట్టు వుంటుందా! సొంత వాళ్లని వదులుకుని దిక్కూమొక్కూ లేని వాళ్లల్లా ఎలా బ్రతకాలి? అన్న ఆలోచన మనసుని పట్టి పీడిస్తుంటే, భార్య వెర్రిదానిలా తనవీ, నావీ సామాన్లు తీసి పెట్టెల్లో సర్దుతోంది. ఆమె కడుపులో ఏముందో! బాధో, కాలానికి సర్దుకుపోవడమో!' అర్థం కావటం లేదు అయోధ్యరామయ్యకి.

కొడుకూ, కోడలూ ఏదో పనుందంటూ ఎంబెసీకి వెళ్లారు. ఓ ప్రక్క చెమటలు తుడుచుకుంటూ పెట్టెలు సర్దుతున్న అలివేణి వైపు చూస్తూ, 'అలివేణీ!' అని పిల్చాడు అయోధ్యరామయ్య.

'ఏమిటండీ?' అంటూ వచ్చిన భార్యని 'యిలా కూర్చో!' అన్నట్లు చేత్తో సంజ్ఞ చేశాడు.

మెల్లో దోపిన చీర చెంగు తీసి సర్దుకుని భర్త ప్రక్కనే కూర్చుంది అలివేణి.

'అలివేణీ! మన చివరి దశ యిలా వుంటుందని ఊహించావా?' అన్నదానికి వెర్రిదానిలా చూసింది అలివేణి.

'పద్దెనిమిదవ యేట మా యింటికొచ్చావు. అత్త, మామ, ఆడబిడ్డలు, మరుదుల మధ్య పెద్ద కోడలిగా నీ బాధ్యతల్ని నువ్వు నెరవేర్చుకున్నావు. నాకిద్దరు కొడుకుల్ని యిచ్చావు. సిజేరియన్ అంటే

భయపడే రోజుల్లో ప్రాణాలకి తెగించి కన్నావు. ఆ పిల్లలిద్దర్నీ ఎంతో అపురూపంగా పెంచావు. ఒకడిని డాక్టర్ని చేశాము, రెండోవాడిని యింజనీర్ని చేశాము. వేలకి వేలు మనదేశంలోనే గడించుకుంటున్నారు. వాళ్లకొస్తున్న డబ్బుతో హాయిగా గడిచిపోతోంది కదా!' అంటున్న మాటలకడ్డొచ్చి, 'ఏమండీ! చూడండి- రోజులు మారాయండీ! మనం మన వాళ్లందరి మధ్య వుండేవాళ్లం. పురుళ్లకీ, పండగలకీ, శలవలకీ మనవాళ్లంతా యింటికి వచ్చేవారు. వాళ్లంతా యింట్లో తిరుగుతూ సరదాగా కబుర్లు చెబుతుంటే ఎప్పుడూ పనెక్కువయిందనిపించేది కాదండీ! వాళ్లందరికీ చెయ్యవలసిందీ, పెట్టవలసిందీ పెట్టి, మన బాధ్యతల్ని తీర్చుకున్నాం. అప్పుడు కాలం అలాగుండేది. రానురాను కాలం మారింది. పెద్దవాళ్లు కన్నంత మందిని మనం కనలేదు. ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ధరలు పెరిగాయి. వాళ్ళ ఖర్చులూ పెరిగాయి. వాళ్లకీ తీరుబళ్లూ తగ్గాయి. మనం మన పిల్లలకే కాదు, వాళ్ల పిల్లలకి కూడా చెయ్యవలసి వస్తోంది. వాళ్ల పరిస్థితి చూస్తే జాలేస్తోంది. బయట చాకిరీ చేసి వస్తుంది కోడలు. అందుకే నేను ఆ అమ్మాయిని యిబ్బంది పెట్టకుండా నా శక్తికొద్దీ చేసి పెడుతున్నాను. అది మన బాధ్యతగా అనుకుందామండీ!' అంటున్న భార్యవైపు చూస్తూ-

'బాధ్యత! ఎంతకాలం ఈ బాధ్యతలు? సరే, మన బాధ్యతలు మనం నెరవేర్చినప్పుడు మన చివరి దశలో వాళ్ల బాధ్యతలేమిటో తెలుసుకోవలసిన అవసరం వాళ్లకి కూడా వుండాలి కదా! ఇంత స్వార్ధపరులైతే ఎలా?' అంటున్న భర్తని మధ్యలోనే ఆపి-


'చూడండీ! పాపం వాళ్లని స్వార్ధపరులనకండీ- మన కాలంలో ఆస్తి వుండేది. అది అమ్మి ఆడబిడ్డల పెళ్లిళ్లు చేశాం. మిగిలిన దాంట్లో మన వాటాకొచ్చింది అమ్మి పిల్లల్ని ఉన్నతుల్ని చేశాం. వాళ్లని అలా వదిలేసి వుంటే యింతింత ఉద్యోగస్తులయ్యేవారు కాదు. వాళ్ల పిల్లల్ని వాళ్లెలా పెంచుకుందురు?'

'నిజమే, అలివేణీ! పిల్లలకి, పిల్లలికంటూ మనం ఓ చిన్న యిల్లు కూడా కూర్చుకోలేదు. ఓ రెండు గదుల యిల్లయినా వుండివుంటే మనపాటికి మనం బ్రతికేవాళ్లం. వాళ్లు ఉద్యోగస్తులయి మనల్ని ఉద్ధరిస్తారని ఆశించాం. కానీ వాళ్లెంత స్వార్ధ పరులో చూడు- వాళ్లింతటి వాళ్లు కావడానికి కారకులెవరో ఒక్కసారన్నా ఆలోచించారా? తనూ, తన భార్యాపిల్లలూ తప్ప తనకీ ఓ తల్లీ, తండ్రీ వున్నారనీ, ఇప్పుడు ఆ ముసలాళ్లకి ఓ అండ కావాలనీ ఆలోచిస్తున్నారా?' అంటున్న భర్తని చూస్తూ-

'ఏమండీ! మనం పెద్దవాళ్లం. మనం బాధపడితే పిల్లలకి మంచి జరగదు. కన్నాక వాళ్లని పెంచడం మన బాధ్యత! వాళ్లెప్పుడూ హాయిగా, ఆనందంగా వుండాలని కోరుకుందాం. ఎక్కడున్నా వాళ్లు సుఖంగా వుండాలి. మన చివరి దశ అంటారా! దేవుడే వున్నాడు. అన్ని దేశాల వాళ్లూ ఆయా దేశాలని వారి బిడ్డల్ని రానిస్తున్నారు. తల్లిదండ్రుల్ని రానివ్వటం లేదు. దానికి పిల్లలేం చేస్తారు? మననీ తీసుకెళ్లనిస్తే పిల్లలూ తీసుకెళ్తురండీ!' అంటున్న భార్యవైపు ఆశ్చర్యంగా చూస్తూ-

'కాలంతో ఎంత ఎదిగిపోయావు అలివేణీ! ఆ కాలంలో యింట్లో అందరికీ చాకిరీ చేశావు. పురుళ్లు పోశావు. పెళ్లిళ్లు చేశావు. ఒక్కరోజు నీ కష్టం ఏమిటో ఎవ్వరికీ తెలియనివ్వలేదు. కాలం మారిందంటూ పిల్లల భావాల్ని అర్థం చేసుకుని, యిప్పుడు వాళ్ల బుద్ధులకి తగ్గట్టు మారావు. నీలో వున్న ఆ శాంతం, ఆ నిస్వార్ధత, ఆ శక్తి నాకు లేవు, నాకు లేవు అలివేణీ!' అనుకున్నాడు మనసులోనే.

ఇంతలోనే వచ్చిన కొడుకూ కోడలూ లోపలికొస్తూ- 'వచ్చేవారమే మా ప్రయాణం!' అంటూ ఆనందంగా చెప్పుకుపోవడం విన్న తను ఏ భావం వ్యక్తం చెయ్యలేకపోవడం, అలివేణి వెంటనే- 'చాలా సంతోషం బాబూ! హాయిగా వెళ్లి అక్కడ సుఖంగా వుండండి' అంటూ మనసారా దీవించడం మరింత ఆశ్చర్యాన్నే కలిగించింది అయోధ్యరామయ్యకి. 'అందుకే ఆమెని తల్లి అంటారు' అనుకున్నాడు.



మర్నాడు ఆటో తెచ్చి తల్లిదండ్రుల సామాన్లు పెట్టి వాళ్లిద్దర్నీ ఎక్కించి తీసుకెళ్తున్నప్పుడు మాత్రం డెబ్భై ఏళ్ల అయోధ్యరామయ్య మూగగా రోదిస్తుంటే, అలివేణి మాత్రం మనవడిని ముద్దులాడుతూ కొంగుతో కళ్లొత్తుకుంది.

ప్రతాప్ తల్లిదండ్రుల్ని దింపి, అక్కడి అధికారులతో మాట్లాడి తిరుగుముఖం పట్టినప్పుడు తల్లీ తండ్రీ మనసులు విలవిల్లాడిపోయాయి.

ప్రతాప్ రాసే ఉత్తరాలు ఒకటికి పదిసార్లు

చదువుకుని ఆ వృద్ధ దంపతులు ఆనందపడేవారు.

ఆరేళ్లు గిర్రున తిరిగిపోయాయి. ప్రతాప్ కుటుంబంతో త్వరలోనే వస్తున్నట్లు రాసిన ఉత్తరం అందుకున్న ఆ దంపతుల ఆనందం వర్ణనాతీతం.

ప్రతాప్ వచ్చిన రెండు రోజులకి ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లాడు. అక్కడ తల్లీ, తండ్రీ లేరు. అక్కడ అందర్నీ వాకబు చేశాడు. ఎవ్వరూ వాళ్ల గురించి చెప్పలేకపోయారు. ప్రతాప్‌కి మతిపోయినట్టయింది. 'తను వాళ్లని చేర్పించింది యిక్కడే కదా!' అనుకున్నాడు. ఏదో ఆలోచన రాగా బ్యాంకుకెళ్లి తండ్రి అకౌంటులో డబ్బు చూశాడు. మొదట ఓ నెల మాత్రం కొంత డబ్బు తీసినట్లు వుంది. తరువాత తనూ, అన్నయ్యా పంపిన డబ్బులో ఒక్క రూపాయి కూడా తియ్యలేదు. 'ఏమయిపోయారిద్దరూ? అప్పుడప్పుడు రాసే ఉత్తరాలు వాళ్లకి అందాయా? వాళ్ల దగ్గర నుంచి జవాబు రాలేదని ఎప్పుడూ ఆలోచించలేదే! ఏమయ్యారు? ఎక్కడున్నారు? బ్రతికున్నారా?' అన్న ఆలోచన రాగానే మనసు కదిలి ఏదో బాధ తన్నుకొచ్చి, మనస్సుని వికలం చెయ్యసాగింది. ఒక్కసారి గతాన్ని తల్చుకుని బాధపడసాగాడు. అమ్మానాన్న యింట్లో పెద్దకొడుకూ, కోడలిగా యిల్లంతటినీ చక్కదిద్దడంతోపాటు తను వాళ్లని ఓల్డేజ్ హోమ్‌లో దింపేవరకూ తమకి చేసిన చాకిరీ గుర్తొచ్చింది. విదేశాల్లో పనివాళ్లుండక ఇంట్లో చాకిరీ చెయ్యలేక భార్య చేసే గొడవ గుర్తొచ్చి– 'మా అమ్మ చేస్తే కూర్చుని తినడమా?' అని అనుకున్నా, గట్టిగా భార్య దగ్గర అనే ధైర్యం వుండేది కాదు. ఫారిన్ వెళ్లాక తల్లిదండ్రుల మీద అభిమానం కన్నా, వాళ్లు చేసిన చాకిరీ మధ్య తామెంత నిశ్చింతగా, నిర్పూచీగా కాలం గడిపామన్నది తరచూ గుర్తొచ్చేది. కానీ, అక్కడ వచ్చే డబ్బుకి ఆనందపడుతూ ఆ జ్ఞాపకాల్ని మర్చిపోతూ వుండేవారు.

ఇంత దూరం వాళ్ల కోసం వస్తే ఆ తల్లీ తండ్రీ ఈ హోమ్‌లో లేకపోవడం ఏమిటి? వాళ్ల గురించి తెలీకపోవడంతో ఏదో ఆదుర్దాలాంటిది కలిగింది. ఇంక లాభం లేదని ఆ హోమ్ నడుపుతున్న యజమాని ఫోన్ నెంబరు తీసుకుని ఫోన్ చేశాడు.

ఆ యజమాని పేరు కిరణ్. అతనితో తన వివరాలు చెప్పి, తన తల్లిదండ్రుల వివరాలు చెప్పి, వాళ్లని ఆ హోమ్‌లో చేర్పించిన తారీఖు, వివరాలు చెప్పగానే, అవతలి నుంచి కిరణ్– 'మిస్టర్ ప్రతాప్! మీరోసారి మా ఇంటికి వస్తే మీతో వివరంగా మాట్లాడతాను' అని ఫోన్ పెట్టెయ్యడంతో ప్రతాప్‌కి గాభరా కలగసాగింది. టాక్సీ చేయించుకుని అతనిచ్చిన వివరాలు పట్టుకుని తిన్నగా అతనింటికి వెళ్లాడు. హాల్లో కూర్చోబెట్టిన బంట్రోతుతో పంపిన కార్డు చూసి బైటికొచ్చిన కిరణ్‌ని పరిచయం చేసుకుని, తల్లిదండ్రుల వివరాల గురించి చెప్పగానే కిరణ్ అతన్ని వెటకారంగా చూస్తూ–

'మిస్టర్ ప్రతాప్! మీకు కొన్ని విషయాలు చెప్పాలి. మీకు తెలియనివేం కాదు. తల్లీ తండ్రీ అంటే ప్రత్యక్ష దైవాలు. అందులో తల్లి మరీనూ. తండ్రి లేకపోయినా తల్లి తాను గంజి తాగి పిల్లలకి మెతుకులు పెట్టి పెంచుతుంది. పదిమంది పిల్లల్ని ఒకేసారి కష్టపడి పెంచగలిగే ఆ తల్లిదండ్రుల్ని చివరి దశలో ఒక్క బిడ్డ పెంచలేదూ? మీ మీ స్వార్థాలకి వాళ్లని వదిలేసి వెళ్లిపోయారు. వాళ్ల మనోవేదన గురించి ఒక్కసారన్నా ఆలోచించారా? డెబ్బై ఏళ్లు దాటిన వారికి కావలసింది మీరు పంపే డబ్బు కాదు. తోటి మనిషి ఆప్యాయత, అనురాగం. మీరు డబ్బు పంపి మీ బాధ్యత చాలా చక్కగా తీర్చుకున్నాం అనుకుంటున్నారు. మీ వయసు వారికి రాదు. వాళ్ల వయసు మీకు వస్తుంది. అప్పుడు మీ పరిస్థితీ యిలాగే వుంటే? ఒక్కటి గుర్తుంచుకోండి– ఓల్డేజ్ హోమ్‌లు దిక్కులేని వారికి. దిక్కులేనివారు మనకెవ్వరూ లేరన్న ఒక నిర్ణయంతో ఈ హోమ్‌లలో బ్రతుకుతారు. పిల్లలుండీ చూడనివాళ్లు అలా సర్దుకోలేరు' అంటూ గట్టిగా చెప్తున్న కిరణ్ వైపు చూస్తూ– 'సార్! ముందు మా అమ్మానాన్నా ఎక్కడున్నారు? ఎలాగున్నారో చెప్పండి సార్!' అంటూ చేతులు జోడించి అర్థిస్తున్న ప్రతాప్‌ని చూస్తూ–

'మీకు మరో విషయం చెప్తా వినండి– నేను చిన్నప్పుడు వారాలబ్బాయిని. దిక్కూమొక్కూ లేని అనాధని. మీ అమ్మగారు నాకు వారానికి రెండు

రోజులు మీతో సమానంగా భోజనం పెట్టడమే కాదు, మీ బట్టలు, మీ పాత పుస్తకాలు ఇచ్చేవారు. మీకూ గుర్తుండే వుంటుంది. ఆ రోజుల్లో మీ కుటుంబంలో మీ అమ్మగారు నిర్వహించే పాత్ర చూశాను. ఆమె దయవల్లే నేను గ్రాడ్యుయేషన్ చేశాను. ఉద్యోగం చేసుకుంటూనే నేను పి.జి. చేశాను. ఉద్యోగంలో చేరి ఈ హోమ్ ప్రారంభించాను. నేను పెరిగిన వాతావరణమే నా చేత ఈ హోమ్ నడిపే స్థితికి తీసుకొచ్చింది. చిన్నగా ప్రారంభించిన నా హోమ్‌ని చూసి ప్రభుత్వ సహకారం, కొందరు పెద్దల సహకారం లభించడంతో నా హోమ్ బాగా నడుస్తోంది. మీరు మీ తల్లిదండ్రుల్ని చేర్పించాక- వారి వివరాలు చూసి వారిని గుర్తుపట్టాను. ఇలాంటి తల్లినా యిందులో చేర్పించారని బాధ కలిగింది. ఆ తల్లి నాకారోజు తిండి, బట్ట పెట్టకపోయివుంటే నేనింతటి వాడిని కాకపోదును. మీ అమ్మగారికి నేను జీవితాంతం రుణపడి వున్నాను. వారు చేసింది గుర్తొచ్చి వారి దగ్గరికి వెళ్లాను. వారు నన్ను గుర్తుపట్టలేదు. వారికి నా వివరాలు చెప్పి వారిని నా యింటికి తీసుకొచ్చాను. ఆనాటి నుంచీ నా దగ్గరే వుంచుకున్నాను. మీరు పంపే డబ్బు వారిని నేనే తీసుకోనివ్వలేదు. మీరు రాసే ఉత్తరాలు వారు చదువుకుని పడే ఆనందం వర్ణనాతీతం. వాళ్లు రాసిన ఉత్తరాలు కావాలనే నేను పోస్టు చెయ్యలేదు. డబ్బుతో బాధ్యతలు వదులుచ్చుకునే మీలాంటి కొడుకులకి ఉత్తరాలెందుకు రాయాలిట? నేనూ దేశంలో యిలాంటి అనాథలందర్నీ ఉద్ధరించలేను. కానీ, నన్ను తల్లిలా ఆదుకున్న ఒక్కరినైనా ఆదుకుని వారి రుణం తీర్చుకోవాలనుకున్నాను. ప్రతి కొడుకూ ఒక్కసారి తల్లిదండ్రుల రుణం గురించి ఆలోచించుకుంటే దేశంలో అంతా వుండి దిక్కులేని వారుండేవారు కాదు. వెళ్లండి- ఆ వెనక గదిలో వున్న ఆ వృద్ధుల్ని చూడండి!' అన్న మాటలు విని ఆత్రంగా వెళ్లిన ప్రతాప్ వారిని చూసి ఆనందం పట్టలేక కౌగిలించుకున్నాడు.

ఎ.సి. గది. ఓ ప్రక్క పూజా మందిరం. చక్కటి పడకలు, రెండు సోఫాలతో ఎంతో చక్కగా వుందా గది. వంటవాడిచ్చిన కాఫీలు తాగుతున్న ఆ దంపతులు ప్రతాప్‌ని చూసి- 'నాన్నా... ఎప్పుడొచ్చావురా! చంటాడేడీ? కోడలేదీ? ఎలాగున్నార్రా! హాయిగా వున్నారా? ఆ ఊళ్లో అన్నీ దొరుకుతాయా?' అని అడుగుతున్న ఆ తల్లి ఒళ్లో అశ్రునయనాలతో వాలిపోయిన కొడుకుని చూస్తూ కిరణ్- 'చూశారా ప్రతాప్! వాళ్లనే తల్లీ తండ్రీ అంటారు. ఇప్పుడు కూడా మిమ్మల్ని నిందించకుండా మీ క్షేమాన్నే వాకబు చేస్తున్నారు. వీళ్లనే ప్రత్యక్ష దైవాలంటారు!' అన్న మాటలకి తలెత్తుకోలేక, 'అమ్మా! త్వరలో మనదేశానికి వచ్చేసి మళ్లీ మిమ్మల్ని మనింటికి తీసుకెళ్లిపోతానమ్మా!' అంటున్న ప్రతాప్‌ని చూసి 'అలాగే బాబూ!' అని ఆనందపడుతున్న ఆ దంపతుల్ని చూసి కిరణ్ మనసు పొంగిపోయింది.

## కిం...కర్తవ్యం??

వంకర రహదారి!
ముక్కుసూటిగా నడవాలని
అభ్యుదయం నేర్పిన ఆదర్శం!
లింకులతో వ్యవస్థ
శంకలతో అవస్థ
ఆంక్షలతో ఆగుతుందా
సంక్షేమాల కవనం??

◆ ◆ ◆

అ ఆ లు
అన్యాయానికి గురవుతాయి!
పలకా బలపాలు
పక్కదార్లు పడతాయి!
బాలకార్మిక నిషేధ చట్టాలు
భావ ప్రకటనలకి పనికొస్తాయి!
పాలబుగ్గల పసిబాల్యం మాత్రం
పాలమూరు 'పని'కొస్తాయి!!

◆ ◆ ◆

ధనమున్నవాడు నియమాల
విధానాన్ని ప్రకటిస్తాడు!
పక్కవాడు పరుగెత్తుకెళ్లొచ్చు-
బక్కవాడు మాత్రం
బరువు మోస్తూ
పాకుతూనే గమ్యం చేరాలి!!

*- వారణాసి రామకృష్ణ*